క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హాజరవుతారన్నారు.

రోడ్లకు మరమ్మతు



ఆమిదాలగొంది వద్ద కల్వర్టు పనులు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను రూ.40 లక్షలతో మరమ్మతులు పనులు చేపట్టామని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ఆమిదాలగొంది వద్ద దెబ్బతిన్న కల్వర్టు, సీసీ రోడ్డు పనులు చేస్తున్నామన్నారు. అదే విధంగా శివాపురం, ఆర్ అనంతపురం వద్ద కల్వర్టు పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు.

పాఠశాలలో రికార్డుల తనిఖీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు,, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుడు మురళీధర్, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పరిగి: మండలంలోని చిన్నపల్లిలో సోమవారం ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ధ్వజ స్తంభం, విమాన గోపురం, కలశ స్థాపన అనంతరం ఆలయ గర్భగుడిలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయంలో వివిధ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు మాలగుండ్ల రవీంద్ర విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హిందూపురానికి రాకపోకలు బంద్



హిందూపురం రోడ్డు బంద్ చేసిన దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటు వద్ద మరమ్మతుల కారణంగా సోమవారం రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాక్ మరమ్మతు చేస్తుండడంతో మంగళవారం కూడా ఆర్అండ్‌బీ రోడ్డు బంద్ చేస్తున్నట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. అయితే ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద రోడ్డు బంద్ చేయడంతో వాహనదారులు రైల్వే సిబ్బందితో వాదనకు దిగారు. పాలసముద్రం వైపు నుంచి హిందూపురానికి ప్రయాణించి ప్రజలు సహకరించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

పెనుకొండ: పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో త్వరలో ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేస్తామని సబ్‌కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని భువన విజయం సమావేశపు భవనంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, అయితే ఈ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అన్న విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే సచివాలయాలు, వివిధ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేస్తామన్నారు.

నేడు ప్రజా వేదిక

పెనుకొండ: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. 2020 నుంచి 2022 మార్చి 31 వరకు రెండు సంవత్సరాలకు సంబంధించి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై దుద్దేబండ క్రాస్‌లోని స్పీడు బ్రేకర్లు దగ్గర సోమవారం ముందు వెళ్తున్న కారు ను ఢీ కొన్న తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఎవరికి గాయాలు కాలేదని, అయితే కారు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతినిందని పోలీసులు తెలిపారు.

నో సిగ్నల్!

- సెల్‌టవర్లు ఉన్నా పని చేయని ఫోన్లు
- అవస్థలు పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని నెట్‌వర్క్ కంపెనీలు

రొళ్ల: ప్రస్తుతం అందరికీ సెల్‌ఫోన్ ఉండటం సహజమైపోయింది. ఏ ఇంట్లోనైనా సరే టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, మిక్సీలు తదితర గృహోపకరణాలు ఉన్నా లేకపోయినా సెల్‌ఫోన్ మాత్రం మాత్రం కచ్చితంగా ఉంటుంది. ఆధార్ మొదలుకుని ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి సెల్ నంబరు ప్రస్తావిస్తూ అడుగుతున్నారంటే సెల్‌ఫోన్ల మానవ జీవితంలో ఎంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. సెల్‌ఫోన్ల వినియోగమైతే అంతకంతకు పెరుగుతున్నా అందుకు తగ్గట్లుగా కొన్ని ప్రాంతాల్లో మాత్రం సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయకపోవడంతో కొండలు, తగ్గు ప్రదేశాల్లో ఉన్న గ్రామీణా ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ పని చేయక ప్రజలు (వినియోగదారులు) అనేక ఇబ్బందులు పడుతున్నారు.

తాలూకా వ్యాప్తంగా ...

నియోజకవర్గంలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 375 గ్రామాలు ఉన్నాయి. అందులో సుమారుగా 16 గ్రామ పంచాయతీల్లో సెల్ టవర్లు ఉన్న సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ సక్రమంగా అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏర్పాటు చేసిన సెల్ టవర్లకు సిగ్నల్స్ (ఫ్రీక్వెన్సీ) పెంచాలని వినియోగదారులు కోరుతున్నప్పటికీ ఆయా కంపెనీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రొళ్లలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు విద్యుత్ సౌకర్యం ఉంటేనే పని చేస్తాయి. లేకపోతే సరిగా పనిచేయవు. మొబైల్స్ సిగ్నల్స్ కోసం కొన్ని గ్రామాల్లో కొండలు, గుట్టలు, ఇళ్ల పైకి ఎక్కి వినియోగదారులు మాట్లాడల్సిన పరిస్థితి నెలకొంది. ఇక కొన్ని చోట్ల అయితే సిగ్నల్స్ అందక చౌకాధాన్యపు డిపో డీలర్లు షాపులో ఈ-పాస్ (యంత్రాలు) మిషన్లు కూడా సరిగా పని చేయకపోవడం లేదు. దీంతో అటు ప్రజలు ఇటు అధికారులు కూడా అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పూర్తిగా సిగ్నల్స్ అందని గ్రామాలు..

నియోజకవర్గంలోని రొళ్ల మండలంలో టీడీ పల్లి, దాసప్పపాళ్యం, క్యాతప్పపాళ్యం, గొట్టుగుర్కి, అమరాపురం మండలంలో అగ్రహారం, యరగుంటపల్లి, గుడిబండ మండలంలో మేకలఘట్ట, ఎస్ఎస్ గుండ్లు, మడకశిర, అగళి మండలాల్లో కూడా పలు గ్రామాలకు సెల్ టవర్ల నుంచి సిగ్నల్స్ అందడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత సెల్ కంపెనీలు సిగ్నల్స్ రాని గ్రామాలపై దృష్టిసారించి సెల్ టవర్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వినియోగదారులు ఇబ్బందు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రొళ్లలో ఏర్పాటు చేసిన ఓ సెల్ టవర్

చాలా ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామం కొండల మధ్య ఉండటం వల్ల నెట్‌వర్క్ సరిగా అందడం లేదు. దీంతో సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. అత్యవసర సమయంలో ఇతర ప్రాంతాలకు ఫోన్ చేయాలంటే ఏకొండనో లేక గుట్టలు ఎక్కడంతో పాటు పెద్ద ఎత్తున నిర్మించుకున్న ఇంటిపైకి ఎక్కి మాట్లాడల్సిన పరిస్థితి నెలకొంది. మా గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి మా ఇబ్బందులను తొలగించాలి. – కరియన్న, టీడీ పల్లి, రొళ్ల

ఇంట్లో ఉంటే సిగ్నల్స్ అందవు



మా గ్రామం రొళ్ల మండల కేంద్రానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉంది. కాలనీ మాత్రం బసవన్న కొండ పక్కనే ఆనుకుని ఉండడంతో ఇంట్లో ఉంటే మాత్రం సిగ్నల్స్ సరిగా రాక ఫోన్లు పని చేయడం లేదు. ఇంటి బయటకి వస్తే ఒకటి రెండు పాయింట్లు మాత్రమే సిగ్నల్స్ వస్తాయి. ఎవరికైనా ఫోన్‌చేసినా మాటలు సక్రమంగా వినిపించడం లేదు. – ఆంజినేయులు, కొడగార్లగుట్ట

జాతిపితకు ఘన నివాళి



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

హిందూపురం టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ సర్కిల్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ సభ్యులు పట్టణంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి వారం రోజులకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు.వాసవీ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ కట్టా అమర్, కోఆర్డినేటర్ దాసా గంగాధర్, క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 88 కోట్లతో నీటి ట్యాంకుల ఏర్పాటు



మాట్లాడుతున్న కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలో రూ. 88 కోట్లతో నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నగర పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపరితల ట్యాంకులు, పైప్‌లైన్‌లు , నూతన కొళాయిలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు పాతవి కావడంతో అనేక చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి తిమ్మాపురం వాటర్ సంప్‌కు పంపింగ్ చేసి అక్కడి నుంచి పట్టణంలోకి నీటిని సరఫరా చేస్తామన్నారు. కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ మాట్లాడుతూ అమృత్ పథకం కింద బాబాయ్య స్వామి చెరువు ప్రాంతంలో రూ. 95 లక్షలతో హరిత వనం ఏర్పాటు చేసి సుందరీకరణకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ పరిధిలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి 90 కి.మీ పైప్‌లైన్ వేస్తామని చెప్పారు. పలు సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. అనంతరం సభ్యులు పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. వైస్‌చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు నందినిరెడ్డి, తయూబ్, రఘునాథరెడ్డి, ఫర్జియాభాను, షహనా బీ, బోయ హారతి, సంజీవమ్మ, లావణ్య, నాగరత్న, నందిని, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, శేషాద్రి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థల కేటాయింపు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటిక స్థలం కోసం పోరాడుతున్న రొప్పం గ్రామస్తుల పోరాటం ఫలించింది. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఆదేశాల మేరకు టీఎన్ పేట రైల్వేట్రాక్ వద్ద సుమారు 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్మశాన వాటికకు రెవెన్యూ అధికారులు సోమవారం కేటాయించారు. ఇదిలా ఉండగా.. రొప్పంకు చెందిన ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందగా..ఆ శవాన్ని పూడ్చడానికి స్థలం లేకపోవడంతో మృతుడి బంధువులు ఆగ్రహించి జేడీఎస్ నాయకుడు సాగడు వెంకటేశ్ నేతృత్వంలో ఆదివారం రాత్రి ఆందోళన చేశారు. తహసీల్దార్ వరదరాజు ఘటనా స్థలానికి చేరుకుని శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే వెంకటరమణప్ప టీఎన్ పేట గ్రామ శివార్లలోని రైల్వే ట్రాక్ వద్ద సుమారు 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి వెంటనే ఆ స్థలాన్ని శ్మశాన వాటిక నిర్మాణానికి కేటాయించాలని తహసీల్దార్ వరదరాజుకు సూచించారు.

నేడు వాహనాల వేలం

గుడిబండ: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్ఐ ముని ప్రతాప్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు వాహనం అప్‌సెట్ అమౌంట్‌లో 10 శాతం చెల్లించాలన్నారు. అలాగే ఆధార్‌కార్డ్, పాన్‌కార్డు తీసుకురావాలన్నారు.

రేపు లేపాక్షిలో..

లేపాక్షి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఐ మునీర్‌అహమ్మద్ తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొని, పాల్గొన్న వేలం పాటదారులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

పరిగిలో...

పరిగి: మండలంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు వేలం ఉంటుందన్నారు.

గోరంట్లలో...

గోరంట్ల: గోరంట్ల పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం ఉదయం10 గంటలకు స్టేషన్ ఆవరణంలో వేలం వేస్తున్నట్లు సీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. 51 ద్విచక్ర వాహనాలతో పాటు ఆటో, కారును కూడా వేలం వేస్తామన్నారు.

శుభ్రమైన నీటితోనే ఆరోగ్యం



జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: నీటి ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని శుభ్రమైన తాగునీటితో ఆరోగ్యవంతులవుతామని వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. సోమవారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యమని బ్యానర్లు చేతపట్టి మహిళలతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని నీటి సంరక్షణ ఆవశ్యకత వివరించారు.

ఔషధ మొక్కల పంపిణీ..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేర్‌హెల్త్ ఆధ్వర్యంలో మహిళలకు ఆయుర్వేద ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. ముందుగా సభలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేపల చెరువు వేలం వాయిదా

అమరాపురం: స్థానిక సచివాలయంలో కార్యదర్శి ఈరన్న ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ చేపల చెరువులో చేపల పెంపకానికి వేలం పాట నిర్వహించారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన మొత్తానికి తక్కువగా పాటదారులు పాడారని, దీంతో వేలం వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ సుధాకర తెలిపారు.

ప్రశాంతంగా వాహనాల వేలం

అమరాపురం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మడకశిర సెబ్ సీఐ.భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 7 ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించగా రూ.50,150 ఆదాయం వచ్చిందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి బ్రిలియన్స్ స్కూల్ కరస్పాండెంట్ తిమ్మారెడ్డి అంత్యక్రియలు సోమవారం పూర్తయ్యాయి. ఇందులో భాగంగానే నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, నాయకులు జయశంకరరెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్‌నాయక్, సద్దాం, రామాంజనేయులు, నాయకులు యాసిన్, శ్రీరాములు తదితరులు తిమ్మారెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మఠంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యారాధన పర్వదినానం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

గోరంట్ల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గోరంట్ల మండల తహసీల్దార్ రంగనాయకులు జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌తో ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జెడ్పీటీసీ పాలేజయరాంనాయక్‌తో పాటు మందలపల్లి ఉమ్మడి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో సోమవారం ఇళ్ల నిర్మాణాన్ని హౌసింగ్ అధికారులు పరిశీలించారు. లేఅవుట్‌లో లబ్ధిదారులు పునాదుల వరకూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

అమరాపురం: మండల పరిధిలోని కాచికుంట గ్రామ సమీపంలో మల్టీ పర్పస్ సబ్‌ప్లాన్ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం మండల సర్వేయర్ దినేష్‌రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు చిక్కన్న, సీఈఓ గురుమూర్తితో కలసి కాచికుంట గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం అవసరమని వారు తెలిపారు. వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం గోదాము నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



పప్పుశనగ పంట పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణమీనన్

మడకశిరరరూరల్: మండలంలో ఈఏడాది బోరు బావుల కింద రైతులు రబీలో సాగు చేసిన పంటలను సోమవారం వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణ మీనన్ పరిశీలించారు. పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. గత ఏడాది రబీలో కల్లుమర్రి ఆర్బీకే పరిధిలో రైతులు సాగు చేసిన వరి, పప్పు శనిగ పంటల ఈ- క్రాప్ బుకింగ్ నమోదును సూపర్ చెక్ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఆర్బీకే ద్వారా అందించే సేవలు, రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ వీరనరేష్, ఆర్బీకే అధికారి విజయ్, రైతులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

సోమందేపల్లి: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సర్పంచ్ గంగాదేవి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన సోమందపల్లిలోని సాయినగర్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి పక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర , సీహెచ్ఓ శిరీష్, వార్డు సభ్యులు బాబు గంగాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. సోమవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం ఆర్డీటీ రీజినల్ కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు రీజినల్‌స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులు మేధాశక్తిని పెంచుకొని రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని, ఇందుకు ఆర్డీటీ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ నారాయణస్వామి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

హిందూపురం టౌన్: హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఓ వ్యక్తికి స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మడకశిర ప్రాంతానికి చెందిన శంకర్‌నాయక్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో రూరల్ సీఐ కృష్ణారెడ్డి.. ఏఎస్ఐ బాలరాజు ద్వారా లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్‌కు తెలియజేశారు. దీంతో వారు స్పందించి పట్టణంలోని శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు చేశారు.

వడ్డెర్ల రాజకీయ అభివృద్ధికి కార్యాచరణ

హిందూపురం: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వడ్డెర్ల రాజకీయ అభివృద్ధికి త్వరలోనే కార్యచరణ చేపడతామని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలియజేశారని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, వడ్డేర్ల జిల్లా అధ్యక్షుడు వడ్డె అశోక్‌లు తెలిపారు. హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘనేత కృష్ణయ్యను కలిసి వడ్డెర్ల రాజకీయ భవిష్యత్తుపై చర్చించామన్నారు.

ఉప్పర కులస్తులు సంఘటితం కావాలి



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఉప్పర కార్పొరేషన్ అధ్యక్షుడు గిరీశ్

పావగడ: ఉప్పర కులస్తులు సంఘటితం కావాలని, అప్పుడే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందడానికి సాధ్యమవుతుందని కర్ణాటక రాష్ట్ర ఉప్పర సామాజిక వర్గ కార్పొరేషన్ అధ్యక్షుడు జీకే గిరీశ్ సూచించారు. స్థానిక యోగి నారాయణ స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పావగడ తాలూకాలో సుమారు 10 వేల మంది ఉప్పర సామాజిక వర్గం ఓటర్లు ఉన్నారని.. అందరూ కలసి ఐకమత్యంతో పోరాడితే విద్య, ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందుతారన్నారు. ఉప్పర కార్పొరేషన్ నుంచి తాలూకాలోని సామాజిక వర్గ పేదలకు గృహ నిర్మాణం, గంగా కళ్యాణి , నేరుగా రుణాల పంపిణీ పథకాలను వర్తింపజేస్తామన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఉర్దూ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. ఉర్దు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పఠాన్ ఇమ్రాన్ సహకారంతో సోమవారం పదో తరగతి ఉర్దూ విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, ఉపాధ్యాయులు ఐనూద్దీన్, హరి, దుర్గా, ఇమ్రాన్, రియాజ్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం నుంచి ఓడీసీ, కదిరి మండలలకు కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఓడీసీ మండలం చౌడేపల్లికి చెందిన బండి వంశీకృష్ణ , కదిరి పట్టణానికి చెందిన మున్నూర్ వాలిఖాన్ ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందినట్లు చెప్పారు. సోమవారం కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద వారిని అదుపులోకి తీసుకొని 296 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని రాంపురం హైస్కూల్‌లో విద్యార్థులు, గ్రామస్తులకు రాఘవేంద్ర ఇండియన్ గ్యాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రమాదల నివారణపై అవగాహన కల్పించారు. ఫైబర్ సిలిండర్ వినియోగం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మేనేజర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా వాల్మీకుల ప్రచారం

పావగడ: దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి వాల్మీకి ఆశ్రమంలో వచ్చేనెల 8, 9న జరిగే వాల్మీకి జాతర ప్రచారం ఊరూరా సాగుతోంది. ఈ సందర్భంగా తాలూకాలోని దొమ్మతమరి, గుమ్మఘట్ట, మురారాయన హళ్లి గ్రామాల్లో సోమవారం జాతర సమితి సభ్యులు ప్రచారం చేశారు. ఆ సమితి అధ్యక్షుడు నారాయణమూర్తి, శాంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఫిబ్రవరి 9 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారికి రోజుకో వాహన సేవ ఉంటుందని, 5న బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కరుణించు గంగమ్మ తల్లీ..



మడకశిరరూరల్: మండల పరిధిలో చందకచెర్లలో భక్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం ఘనంగా గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాన కార్యక్రమం జరిగింది. వేకువజాము నుంచి పురోహితులు కుంభాభిషేకం, చండీ హోమం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గంగమ్మదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.